క్లుప్తంగా

చలో విశాఖ జయప్రదానికి పిలుపు

నెల్లూరు(బృందావనం): విశాఖపట్నంలోని కెనడియన్ బాప్టిస్టు చర్చికి చెందిన వేలాది కోట్ల రూపాయల ఆస్తుల సంరక్షణకు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో జూన్ 6న చేపట్టనున్న చలో విశాఖను జయప్రదం చేయాలని ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు రెవ.రాజశేఖర్ దాసరి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నగర నడిబొడ్డున, నగర పరిసరాల్లో ఉన్న చర్చి ఆస్తులను పలువురు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆస్తుల పరిరక్షణతో పాటు వాటిని క్రైస్తవ సమాజాభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది గుడుగుంట వేణుగోపాల్ తన తల్లి లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా పౌష్టికాహారం అందజేశారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ మిత్రులు, వైద్యులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలోని సచివాలయాన్ని మేయర్ స్రవంతి శుక్రవారం తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మేయర్ వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు (దర్గామిట్ట): మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డిని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ విభాగం అధ్యక్షుడు మాలెం సుదీకర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఒంగోలులోని బాలినేని నివాసంలో ఆయన్ని కలిసి శాలువాతో సత్కరించారు.

నేడు హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): హైస్కూల్ ప్లస్ స్కూల్స్‌లో బోధించేందుకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు తమ సర్వీసు రిజిష్టర్‌ను తప్పకుండా తీసుకరావాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : గేదెలను ఢీకొని మోటారు బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన సుధీర్‌కుమార్ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వస్తుండగా, గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి పడింది. ఈ ప్రమాదంలో సుధీర్‌కుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రతా నియమాలు పాటించాలి



మనుబోలు : ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై ముత్యాలరావు సూచించారు. ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు నియమ నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఆటోలో సౌండ్ బాక్సులను ఉంచరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి ఆటో నడిపితే కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌సీ నారయ్య, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌తో మెరుగైన సేవలు



గృహలబ్ధిదారురాలితో మాట్లాడుతున్న కమిషనర్



కమాండ్‌కంట్రోల్ భవనంలోని సౌకర్యాలను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి వస్తే నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడం సాధ్యమవుతుందని కమిషనర్ వికాస్‌మర్మత్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమాండ్ కంట్రోల్ భవనంలోని సౌకర్యాల కల్పనను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు, నగర పాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల సమావేశాలు, మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు, విపత్తు నిర్వహణ కేంద్రం, స్పందన పరిష్కార వేదిక, సంస్థ సమాచార విభాగం వంటి వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఇంజినీరింగ్ విభాగ అధికారులు సురేష్, చాణక్య, తదితరులు ఉన్నారు.

గృహ రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు రూరల్: జగనన్న కాలనీల్లోని గృహలబ్ధిదారులు గృహరుణమేళాను సద్వినియోగం చేసుకుని గృహాలను నిర్మించుకోవాలని నగర కమిషనర్ వికాస్‌మర్మత్ అన్నారు. అక్కచెరువుపాడులోని జగనన్న కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన గృహ రుణమేళాలో కమిషనర్ పాల్గొన్నారు. అనంతరం గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. రూరల్ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలోపూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన తోడ్పాటును అందిస్తామన్నారు. హౌసింగ్, మెప్మా, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రంగా భూముల రీసర్వే

• జేసీ రోణంకి కూర్మనాథ్



మాట్లాడుతున్న జేసీ రోణంకి కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో జగన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం కింద భూముల రీసర్వేను సమగ్రంగా చేపడుతున్నట్లు జేసీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. తొలి విడతలో జిల్లాలోని 117 గ్రామాల్లో రీసర్వే చేపట్టామని చెప్పారు. అందుకు సంబంధించి భూముల హద్దు రాళ్ల ఏర్పాటుతో పాటు ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాల నమోదు, తదితర కార్యక్రమాలు 98 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో రెండో విడతలో 62 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందుకు సంబంధించి డీఎల్ఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేశామని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో ఉండేవి మినహా మిగిలిన అన్ని భూములను సమగ్రంగా సర్వే చేసి రికార్డులను సరిచేస్తున్నట్లు తెలిపారు. జూన్ 30లోగా రెండవ విడత రీ సర్వే పనులను పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేశామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రంగనాథ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు వెస్ట్–2 విద్యుత్‌శాఖ ఏఈ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రంగనాయకులపేట, కపాడిపాళెం, రైల్వేఫీడర్స్‌రోడ్డు, ఇసుకడొంక, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

• నవాబుపేట మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని స్టోన్‌హౌస్‌పేట విద్యుత్‌శాఖ ఏఈ సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు."సబ్‌స్టేషన్ పరిధిలోని నవాబుపేట, ఎఫ్‌సీఐ కాలనీ, పుల్లమ్మసత్రం, స్టోన్‌హౌస్‌పేట, తడికలబజారుసెంటర్, ముకుందాపురం, గాండ్లవీధి, లక్ష్మీపురం, షిర్డీసాయినగర్, కుసుమ హరిజనవాడ, యనమలవారిపాళెం, నవాబుపేట మెయిన్‌రోడ్డు, పోలీస్‌క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా 'సమ్మర్ ఫెస్టివల్'



విజేతలుగా నిలిచిన బాలలను సత్కరిస్తున్న వివిధ రంగాల ప్రముఖులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, గ్రీన్ ఫోర్స్ ట్రస్ట్, కృష్ణ కల్చరల్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమ్మర్ ఫెస్టివల్'ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పాటలు, నృత్య పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి విజేతలుగా నిలిచిన 50 మంది చిన్నారులు, వివిధ రంగాలకు చెందిన 12 మంది ఆదర్శ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మెట్టు రామచంద్రప్రసాద్, స్వర్ణసుప్రవీణ, నాగరాజన్, బెంగళూరుకు చెందిన నాట్యగురువు అంబిక, ఏ రాయప్ప, అందె శ్రీనివాసులు, ఎన్ బలరామయ్యనాయుడు, ఎన్వీ రమణయ్య, మెజీషియన్ ఏకేరాయలు, రాచపాళెం రఘు, పెంచలరెడ్డి, నిర్వాహకులు కే మురళీమోహన్‌రాజు, బీ కృష్ణ పాల్గొన్నారు.

నేత్రపర్వం..మల్లికార్జునుడి విహారం



తెప్పపై విహరిస్తున్న ఆదిదంపతులు



ప్రత్యేకాలంకరణలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తెప్పోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం పెన్నానదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి తెప్పలో గంగాదేవి, కామాక్షితాయి, మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూలాలంకరణ చేశారు. అనంతరం శంభోశంకర అని స్మరించుకుంటూ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామారావు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు ఎస్సైలు వీరప్రతాప్, ఆంజనేయులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి–మౌనిజమ్మ, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు–లక్ష్మీకాంతమ్మ, పచ్చిపాల వెంకురెడ్డి– ప్రమీలమ్మ వ్యవహరించారు.

డీఈఈ సెట్-2023కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ప్రాథమిక విద్యలో రెండేళ్ల డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే డీఈఈ సెట్–2023కు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు http://cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం దారుణం



నెల్లూరు (టౌన్): సీబీఎస్ఈ సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హర్ష, శ్రీనివాసులు అన్నారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పాఠ్యాంశాల్లో గాంధీజీ స్థాయి తగ్గించడం, జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం ద్వారా దేశంలో ప్రమాదకర పరిస్థితులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, నరేంద్ర, సుకుమార్, కిరణ్‌కిషోర్, అమృల్లా పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ మృతి

నెల్లూరు(క్రైమ్): వడదెబ్బతో ఓ ఆటో డ్రైవర్ రైలు పట్టాల సమీపంలో మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు..ఉమ్మారెడ్డిగుంటకు చెందిన నరేంద్ర(50), భువనేశ్వరి దంపతులు. వారికి లక్ష్మీప్రియ, శ్రీనాథ్ సంతానం. నరేంద్ర ఆటోనడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన మద్యానికి బానిసయ్యాడు. మద్యంసేవించిన అనంతరం ఆహారం సైతం సరిగా తినేవాడుకాదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన పూటుగా మద్యంసేవించి ఆహారం తీసుకోక వడదెబ్బతగిలి ఉప్పుకట్లవారివీధి వద్ద రైల్వేట్రాక్ సమీపంలో మృతిచెందాడు. గమనించిన సహచర ఆటోడ్రైవర్ రాజేష్ అలియాస్ కన్నా బాధితుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఫ్యూజ్ ఆఫ్ కాల్ సేవలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి కోరారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తిన వెంటనే సరఫరా పునరుద్ధరణకు వినియోగదారుల కోసం 11 ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఏకేనగర్ విద్యుత్ సెక్షన్ కార్యాలయం 94906 15250, బీవీనగర్ సెక్షన్ 94910 44672, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్ 94906 15251, టౌన్‌హాల్‌సెక్షన్ 94408 32324, హరనాథపురం సెక్షన్ 94906 15258, స్టోన్‌హౌస్‌పేట సెక్షన్ 83329 87174 , ఈస్ట్–1 సెక్షన్ 94906 15256, ఈస్ట్–2 సెక్షన్ 94906 15257, వెస్ట్–1 సెక్షన్ 94906 11544 , వెస్ట్–2 సెక్షన్ 94906 15253, కోటమిట్ట సెక్షన్ 83339 00474 నంబర్లకు కాల్‌చేయవచ్చని చెప్పారు.

నమ్మకం కలిగేలా సేవలందించండి

మనుబోలు : గ్రామ సచివాలయాలపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. మండలంలోని అక్కంపేట, వీరంపల్లి సచివాలయాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. అర్జీల రూపంలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. హాజరు పట్టి, పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, మహిళా పోలీస్ ఆయేషా, అర్షియా, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు మహేంద్ర, వసీనా, వీఏఏ శ్రీదేవి పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడు



వెంకటేశ్వరపురంలో పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పెద్దాస్పత్రిలో పండ్లు, రొట్టెలు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీని ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి



రక్తదానం చేస్తున్న డాక్టర్ కాలేషాబాషా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. నగరంలోని 53,54 డివిజన్లలోని పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. వెంకటేశ్వరపురం సెంటర్, జనార్దన్‌రెడ్డికాలనీలోని సీపీఎం కార్యాలయాల వద్ద పుచ్చలపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులరెడ్డి, జాఫర్, వెంకటేశ్వర్లు, గురవారెడ్డి, రమేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): కమ్యూనిస్టు దిగ్గజం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం 47, 48 డివిజన్ల శాఖల ఆధ్వర్యంలో దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలోని ప్రసూతి విభాగంలోని బాలింతలకు పండ్లు, బ్రెడ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం కనకమహల్ సెంటర్‌లోని సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు పీ చంద్రారెడ్డి, కార్యదర్శి అత్తిమూరు శ్రీనివాసులు, నాయకులు కొండయ్య, హజరత్‌బాబు, శ్రీధర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రక్తదానం

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 35 మందికి పైగా వైద్యసిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి హాజరయ్యారు. వైద్యులు సుబ్రహ్మణ్యం, కాలేషాబాషా, మస్తాన్‌బాషా, యూనియన్ నాయకులు సందానిబాషా, నరమాల సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విలేకరులతో మాట్లాడుతున్న రామచంద్రయ్య యాదవ్

నెల్లూరు(వేదాయపాళెం): 2022–23 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో 500కుపైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెవుల రామచంద్రయ్యయాదవ్ తెలిపారు. పొగతోటలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయమహల్‌గేటు సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో జూన్ 2న ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. అర్హులైన విద్యార్థులు తమ పేర్లను వాట్సాప్ నంబర్లు 97058 00794, 94406 16916 లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గంగుల మధుసూదన్‌రావు, యాదవ భవన్ ట్రస్టు చైర్మన్ అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్, నాగేంద్ర, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహామృత్యుంజయ పాశుపత హోమం



నెల్లూరు(బృందావనం): వైశాఖ అమావాస్య సందర్భంగా మూలాపేటలోని శంకరమఠంలో మహామృత్యుంజయ పాశుపత హోమాన్ని శుక్రవారం నిర్వహించారు. వేదపండితులు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. ఉభయదాతలుగా హేమంత్‌విష్ణు దంపతులు వ్యవహరించారు. శంకరమఠం మేనేజర్ కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి పర్యవేక్షించారు.

వైద్యశిక్షణకు వసతులు కల్పించండి



వైద్యకళాశాల ప్రిన్సిపల్‌తో సమావేశమైన డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని వైద్యశాఖకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీ వైద్యసిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ వైద్యకళాశాలలోని సమావేశపు హాల్‌ను కేటాయించడంతో పాటు కనీస వసతులు కల్పించాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య వైద్య కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణను కోరారు. శుక్రవారం దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపల్‌తో డీఎంహెచ్ఓతో పాటు డీపీఎంఓ హరిశ్చంద్ర సతీష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ బేసిక్‌లైఫ్ స్కిల్క్, పాముకాటు జరిగితే చేపట్టాల్సిన ప్రాథమిక మేనేజ్‌మెంట్, ప్రాథమిక చికిత్స, తదితర అంశాలపై ఎంఎల్‌హెచ్‌పీలు/ సీహెచ్ఓలకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఇందుకు సహకరించాలని కోరగా ప్రిన్సిపల్ సమ్మతించారు.

సాహిత్య పురస్కారానికి కవితా సంపుటుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): ఆచార్య ఎన్జీ రంగ సాహిత్య పురస్కారం–2023కు కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఆచార్య ఎన్జీ రంగ ఫౌండేషన్ అధ్యక్షుడు జక్కంపూడి సీతారామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రైతుబంధు రంగ' పేరున ఈ ఏడాది సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. 2020–2022 ఏళ్ల మధ్య ప్రచురితమైన కవితా సంపుటాలను నాలుగేసి ప్రతుల చొప్పున జూన్ 10లోగా పంపాల్సి ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కవితా సంపుటాలకు రూ.10 వేలు, రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను నవంబరులో జరిగే ఆచార్య ఎన్జీ రంగ జయంతి వేడుకల్లో అందజేసి సత్కరించనున్నట్లు వివరించారు. వివరాలకు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ 98497 99711, డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు 93930 15584, జక్కంపూడి సీతారామారావు 98494 97739 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



ఖాదర్‌ఉన్నీసాకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ విజయ డెయిరీ ఎదురుగా నివాసం ఉంటున్న ఎస్కే అమీర్‌జాన్ అనారోగ్యంతో మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేల నగదు చెక్కు మంజూరైంది. అమీర్‌జాన్ భార్య ఖాదర్‌ఉన్నీసాకు కార్పొరేటర్ దేవకొండ సుజాతఅశోక్ చేతుల మీదుగా సచివాలయ సిబ్బంది శుక్రవారం చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో 53/1 వార్డు సచివాలయ అడ్మిన్ చైతన్య, వెల్ఫేర్‌అసిస్టెంట్, వీఆర్వో వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ, ఐసీడీఎస్ పీడీ

నెల్లూరు రూరల్: నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ పోస్టులకు నెల్లూరు ఆర్డీఓ మలోల, ఐసీడీఎస్ పీడీ సౌజన్య శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నెల్లూరు డివిజన్ పరిధిలోని 5 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 28మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 21మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మినీఅంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పోస్టు ఒకటి ఉండగా, ఒక్కరే దరఖాస్తు చేసుకోవడంతో ఎంపిక చేశారు. అలాగే 24 ఆయా పోస్టులకు 70 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 54 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూల్లో సీడీపీఓలు పాల్గొన్నారు.